క్లుప్తంగా

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

ఖానాపూర్: పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, మెస్ చార్జీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ ఉమ్మడి జిల్లా మాజీ కార్యదర్శి బొమ్మెన సురేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని కేఎస్‌ఆర్ కళాశాలలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సమావేశానికి హాజరై మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు నవీన్, ఉపాధ్యక్షుడు దిగంబర్, పరమేశ్, సహాయ కార్యదర్శి ఉదయ్, బబ్లూ, రాకేశ్, నితిన్, ప్రదీప్ ఉన్నారు.

పనులు పరిశీలన

నిర్మల్: దస్తురాబాద్ మండలంలోని మున్యాల, భూత్కూర్, దస్తురాబాద్ గ్రామాల్లో పారిశుధ్య పనులు, హరితహారం నర్సరీలను డీఎల్‌పీవో రమేశ్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులకు సూచనలు చేశారు. ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీవో అనిల్, కార్యదర్శులు సత్యనారాయణ, రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

బాసరలో కార్మికుల ధర్నా



ఆలయంలో కార్మికులు

భైంసా: ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని బాసర ఆలయంలో పని చేసే కార్మికులు శుక్రవారం ధర్నాకు దిగారు. వాగ్దేవి సొసైటీలో పని చేస్తున్న 83 మంది కార్మికులను ఆలయ ఉద్యోగులుగా గుర్తించాలని ఆలయ ప్రాంగణంలో బైఠాయించారు. ఏళ్లుగా పని చేస్తున్న తమను క్రమబద్ధీకరించి ఎనిమిది గంటలు మాత్రమే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సమ్మె విరమించారు.

నేత్ర వైద్యశిబిరం

ఖానాపూర్: పట్టణంలోని శ్రీ మాధవి కంటి ఆస్పత్రి, లయన్స్‌క్లబ్ ఆఫ్ ఖానాపూర్ ఆధ్వర్యంలో పట్టణంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి మోతెబిందు సమస్యలతో బాధపడుతున్న 10మందిని ఆపరేషన్ నిమిత్తం ఆర్మూర్‌లోని లయన్స్ కంటి ఆస్పత్రికి తరలించినట్లు వైద్యులు తూము నిఖిత తెలిపారు. వెంకటస్వామి, సుదర్శన్, వెంకటేశ్వర్లు, చరణ్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



ఎమ్మెల్యే బొజ్జుతో నాయకులు

కడెం: కడెం పీఏసీఎస్ చైర్‌పర్సన్ రామడుగు శైలజ రమేశ్‌రావు, వైస్ చైర్‌పర్సన్ హపావత్ నీలా దేవేందర్, పలువురు డైరెక్టర్లు బీఆర్‌ఎస్ వీడి కాంగ్రెస్‌లో చేరారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇందులో ఎంపీపీ అలెగ్జాండర్, మల్లేశ్, వెంకటేశ్, భూషణం, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



నాయకులతో అధికారులు

కుంటాల: మండలంలోని లింబా(కె) గ్రామంలో శుక్రవారం తాజా మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సరదాగా గడిపి ఐదేళ్లలో చేసిన అభివృద్ధిపై చర్చించారు. ఎంపీపీ అప్క గజ్జారాంయాదవ్, తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఏవో సోమలింగారెడ్డి, ఎం.ప్రదీప్‌కుమార్, ఏఎస్సై రాందాస్, ఎంపీవో రహీం, ఏపీవో నవీన్, ఏపీఎం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై వెళ్లేటప్పుడు జాగ్రత్తగా నడవాలి



బహుమతి అందిస్తున్న ఎంఈఐ శివస్వప్న

భైంసాటౌన్: రోడ్డు వెళ్లేటప్పుడు జాగ్రత్తగా నడవాలని ఎంవీఐ శివస్వప్న అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని శ్రీ గౌతమి పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా రోడ్డు ప్రమాదాలు–జాగ్రత్తలు అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఏఎంవీఐ కవిత, కరస్పాండెంట్ రేగుంట రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం వసూలే లక్ష్యం



నర్సాపూర్(జి)లో కార్యదర్శికి పన్ను చెల్లించి రశీదు తీసుకుంటున్న గ్రామస్తుడు (ఫైల్)



నర్సాపూర్(జి) మండలం గొల్లమాడలో ట్రేడ్ పన్ను వసూలు చేస్తున్న కార్యదర్శి(ఫైల్)

- గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న అధికారులు
- మార్చి నెలాఖరు వరకు గడువు

నర్సాపూర్(జి): గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి పన్నుల వసూళ్లు తప్పనిసరి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికసంఘం ద్వారా మంజూరు చేస్తున్న నిధులతోపాటు ఇంటి పన్నులు సకాలంలో వసూలైతే పల్లె ప్రగతి సాధ్యం అవుతుంది. 2023–24 ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు గడువు సమీపిస్తున్నందున గ్రామపంచాయతీల్లో వందశాతం పన్నులు వసూలు చేయడంపై అధికారులు దృష్టి సారించారు.జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 68 శాతం పన్నులు వసూలయ్యాయి. ఇంకా 32 శాతం పన్నులు వసూలు కావాల్సి ఉంది. పన్నుల చెల్లింపునకు గడువు తేదీ మార్చి31 కాగా.. ఇప్పటికే పంచాయతీ అధికారులు గ్రామాల్లో తిరుగుతూ ప్రజలు పన్నులు చెల్లించేలా అవగాహన కల్పిస్తున్నారు.

ప్రథమస్థానంలో పెంబి మండలం..

పంచాయతీల్లో ఇంటిపన్ను, దుకాణాల నుంచి ట్రేడ్ (వ్యాపార) పన్ను, కుళాయి పన్ను, చెత్త పన్నులను వసూలు చేయాల్సి ఉంటుంది. జిల్లాలో పెంబి మండలం 89 శాతం పన్నులు వసూళ్లు పూర్తి చేసి మొదటి స్థానంలో నిలువగా.. దిలావర్‌పూర్ మండలం 84 శాతం వసూళ్లతో రెండో స్థానంలో నిలిచింది. చివరి స్థానంలో ఉన్న కడెం మండలంలో ఇప్పటి వరకు 52 శాతం పన్నులే వసూలయ్యాయి. నర్సాపూర్ (జి) మండలంలోని నందన్ గ్రామ పంచాయతీలో 90 శాతం పన్నులు వసూలవగా.. తురాటి గ్రామం 51 శాతం పన్నులు వసూలు చేసి చివరి స్థానంలో నిలిచింది.

పన్నుల వివరాలు..

జిల్లాలో ఉన్న 18 మండలాల పరిధిలో 396 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పన్నుల వసూళ్ల లక్ష్యం రూ.8కోట్ల56 లక్షల18వేల474 కాగా ఇప్పటివరకు రూ.5 కోట్ల 82 లక్షల 7వేల 133 వసూలయ్యాయి. రావాల్సిన పన్ను బకాయిలు రూ.2కోట్ల 74లక్షల 11వేల 341 గా ఉన్నాయి.

జిల్లా వివరాలు
మండలాలు–18
గ్రామపంచాయతీలు– 396
పన్నుల వసూళ్ల లక్ష్యం – రూ.8.56 కోట్లు
ఇప్పటివరకు వసూలైనవి –రూ.5.82 కోట్లు
రావాల్సిన బకాయిలు– రూ.2.74కోట్లు

90 శాతం పూర్తయ్యాయి..

నందన్ గ్రామంలో ఇప్పటివరకు 90 శాతం పన్నులు వసూలయ్యాయి. మిగిలిన 10 శాతం పన్నులను కూడా త్వరలో వసూలు చేసి వందశాతానికి చేరుకుంటాం. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పన్నులు చెల్లిస్తున్నారు.

– వెంకటేశ్, కార్యదర్శి, నందన్

లక్ష్యం చేరుకుంటాం

మార్చి నెలాఖరులోగా వంద శాతం పన్నుల లక్ష్యాన్ని చేరుకుంటాం. ఇప్పటివరకు జిల్లాలో 68 శాతం పన్నులు వసూలయ్యాయి. ఎప్పటికప్పుడు పన్నుల సేకరణ వివరాలను పంచాయతీ కార్యదర్శులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలి.

– శ్రీలత, డీపీఓ

కనుల పండువగా సాయి పల్లకిసేవ

ఖానాపూర్: పట్టణంలోని శ్రీవీరాంజనేయ శివ సాయి సమాజ్ జంగల్ హనుమాన్ సాయిబాబా ఆలయ 27వ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం సాయి పల్లకిసేవ శోభాయాత్ర నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఆలయం నుంచి వీధుల గుండా పల్లకిసేవ ఉత్తర వాహిని గౌతమి గోదావరి తీరం వరకు సాగింది. మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. సాయి గీతాలపనలు, డీజే చప్పుళ్ల నడుమ శోభాయాత్ర వైభవంగా సాగింది. అనంతరం గోదావరి తీరంలో సాయిబాబా ఉత్సవమూర్తులకు అర్చకులు రామోజుల శశిధర్‌శర్మ, మల్లేశం అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక ఎల్లమ్మ ఆలయం వద్ద భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు అంకం రాజేందర్, ప్రధాన కార్యదర్శి కొక్కుల ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



అభిషేకం చేస్తున్న భక్తులు



శోభాయాత్రలో భక్తులు

ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి

- మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్

కుభీర్: కార్యకర్తలు సైనికుల్లా పని చేసి ఆదిలాబాద్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. పార్టీ ఎంపీ టికెట్ ఎవరికీ ఇచ్చినా కలిసికట్టుగా పని చేసి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. అధిష్టానం తనకు ఎంపీ టికెట్ ఇస్తామని హామీ ఇచ్చిందని.. టికెట్ రాకున్నా పార్టీ కోసం పనిచేస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు బీఆర్‌ఎస్ చేసిదేం లేదని.. కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభావం ఉండదని.. కాంగ్రెస్, బీజేపీ మధ్యే పోటీ ఉంటుందని పేర్కొన్నారు. ఖానాపూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శేఖర్‌పటేల్, శంకర్ చంద్రే, బాబు, జావెద్‌ఖాన్, అబ్దుల్ వాహెద్, బషీర్, రతన్ తదితరులు పాల్గొన్నారు.



కుభీర్‌లో మాట్లాడుతున్న రేఖానాయక్

గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి

భైంసాటౌన్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణరావు పటేల్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో రాంటెక్ గ్రామ మాజీ సర్పంచ్, పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా ఆయన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో సింధే ఆనంద్‌రావుపటేల్, శంకర్ చంద్రే, రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

సోన్: విద్యార్థులు రోగాల బారిన పడకుండా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని జెడ్పీ సీఈవో, మండల ప్రత్యేకాధికారి సుధీర్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని జాఫ్రపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలను వారు సందర్శించారు. పరిసరాలు తిరుగుతూ పచ్చదనం, పరిశుభ్రత పరిశీలించారు. తరగతులకు వెళ్లి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయులు పరమేశ్వర్, నగేశ్‌కుమార్, ముత్తన్న, అసిఫ్, విజయమాల, అనిత, కార్యదర్శి శారద పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న సుధీర్‌కుమార్

సంక్షిప్త వార్తలు

ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి

కడెం: 19 ఏళ్లలోపున్న వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని తహసీల్దార్ సుజాత పిలుపునిచ్చారు. శుక్రవా రం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో నులి పురుగుల నివారణ మాత్రల పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 20 నుంచి 27 వరకు మాత్రలు పంపిణీ చేస్తామని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. ఎంపీడీవో వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ జయలలిత, హెల్త్ సూపర్‌వైజర్ గోపాల్, సిబ్బంది ఉన్నారు.

నోట్‌బుక్‌లు, పెన్నుల పంపిణీ

ఖానాపూర్: పీఆర్టీయూ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు యాదగిరి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని పాతఎల్లాపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 150 మంది విద్యార్థులకు లాంగ్‌నోట్‌బుక్‌లు, పెన్నులను అందజేశారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు, పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాల్గొట్ కిషన్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు అందజేశారు. హైస్కూల్ హెచ్‌ఎం రమాదేవి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మారుతిస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ క్యాలెండర్ ఆవిష్కరణ

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు మాట్లాడుతూ.. ఉద్యోగుల సంక్షేమం కోసం టీఎన్జీవో నిరంతరం పాటుపడుతుందన్నారు. బాసర సర్కిల్ అటవీ సంరక్షణ అధికారి శరవనణ్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, కార్యదర్శి శ్రీనివాస్, అటవీ శాఖ ఉద్యోగులు నరేశ్, అరుణ్ పాల్గొన్నారు.

నేడు కార్యకర్తల సమావేశం

లోకేశ్వరం: మండల కేంద్రంలోని లక్ష్మి కల్యాణ మండపంలో శనివారం ఉదయం 10 గంటలకు మండలంలోని కాంగ్రెస్ కార్యకర్తలకు సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు గడ్డం సుదర్శన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మాజీ ఎమ్మెల్యేలు రేఖానాయక్, నారాయణ్‌రావు పటేల్ హాజరవుతారని పేర్కొన్నారు.

రేపు ప్రవేశపరీక్ష

సోన్: గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 11న ఆదివారం ప్రవేశపరీక్ష నిర్వహించనున్నారు. మండలంలోని లెఫ్ట్ పోచంపాడ్ సాంఘిక సంక్షేమ గురుకులంలో ఏ సెంటర్‌లో 442 మంది, బీ సెంటర్‌లో 240 మంది పరీక్ష రాయనున్నట్లు ఆర్‌సీవో అలివేలు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి ఒంటిగంట వరకు నిర్వహిస్తారు. పరీక్ష కేంద్రానికి విద్యార్థులు ముందుగానే చేరుకోవాలని వారు సూచించారు.

నేరాల నియంత్రణకే కార్డన్‌సెర్చ్

- ముధోల్ సీఐ మల్లేశ్

ముధోల్: నేరాలు నియంత్రించేందుకే గ్రామాల్లో కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ముధోల్ సీఐ మల్లేశ్ అన్నారు. శుక్రవారం ఉదయం మండలంలోని చించాల గ్రామంలో కార్డన్‌సెర్చ్(కమ్యూనిటీ కాంటాక్టు) నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాల్లేని 111బైక్‌లు, మరో నాలుగు ఇతర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. గ్రామాల్లో అనుమానితులు, అపరిచితులు కన్పిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు సాయికిరణ్, కె.గణేశ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న సీఐ మల్లేశ్

ఖానాపూర్‌లో అలేఖ్యకు ఘన నివాళి

ఖానాపూర్: పట్టణంలో హత్యకు గురైన అలేఖ్య మరణానికి సంతాపంగా సన్ స్కిల్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘన నివాళులర్పించారు. టైలరింగ్ కేంద్రానికి చెందిన సహచర విద్యార్థులు, కేంద్రం నిర్వాహకులు ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించి.. స్థానిక జగన్నాథ్‌రావు చౌరస్తాలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిర్వాహకుడు లాండేరి రవి తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న విద్యార్థులు

బీఆర్‌ఎస్‌కు పలువురి రాజీనామా

లక్ష్మణచాంద: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. శుక్రవారం మండలంలోని కనకాపూర్‌లోని కేఎస్‌ఆర్ ఫంక్షనల్ హాల్‌లో విలేకరులతో మాట్లాడారు. వడ్యాల్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ మేడి నారాగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ కొండ్ర నరేశ్‌రెడ్డి, బాబాపూర్‌కు చెందిన తునికి రాజేశ్వర్, కనకాపూర్ మాజీ సర్పంచ్ మేకల రాజేందర్‌యాదవ్, ధర్మారం తాజా మాజీ సర్పంచ్ కురుమ రాజేందర్‌రెడ్డి, న్యూకంజర్‌కు చెందిన నల్ల లక్ష్మారెడ్డి, మునిపెల్లికి చెందిన వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గురాల లింగారెడ్డి, చామన్‌పెల్లికి చెందిన అయిట్ల సుదర్శన్, మేర సంఘం మండలాధ్యక్షుడు పూసపత్రి గోవర్ధన్, బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు కిరణ్ ఠాకూర్ తదితరులు బీఆర్‌ఎస్‌ను వీడారు. వీరు శనివారం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతారని సమాచారం.

బీజేపీని బలోపేతం చేయాలి

సోన్: పల్లెల్లో బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసమ్మె రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని గంజాల్‌లో గావ్‌చలో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఓడిసెల శ్రీనివాస్, సందుగారి లావణ్య, నవీన్, గంగయ్య, ఫక్రుద్దీన్, నాగరాజు, ముత్తన్న, గంగాధర్, తిరుపతి, రమణ, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

కుభీర్: మండలంలోని బ్రహ్మేశ్వర్ తండాలో శుక్రవా రం గావ్ చలో అభియాన్ నిర్వహించారు. బీజేపీ నా యకులు ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. రాథోడ్ శంకర్, గణపతి, బొమ్మెడి మల్లేశ్ తదితరులు ఉన్నారు.



కుభీర్: పథకాలు వివరిస్తున్న బీజేపీ నాయకులు

లోకేశ్వరం: మండలంలోని వట్టోలి, పంచగుడి గ్రామాల్లో గావ్‌చలో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ నాయకుడు మంద భాస్కర్, మామిడి సంజీవ్‌రెడ్డి, బీజేవైఎం మండలాధ్యక్షుడు మంద గణేశ్, గంజాల గంగాధర్, పీరాజీ పటేల్, ఆనంద్‌రావు పటేల్, భోజప్ప పటేల్ ఉన్నారు.

'భూమి తిరిగి ఇప్పించాలి'

లోకేశ్వరం: మండలంలోని అబ్దుల్లాపూర్ శివారులో ఆ గ్రామ వీడీసీ సభ్యులు స్వాధీనం చేసుకున్న ఐదెకరాల భూమిని తిరిగి కన్కపూర్‌కు చెందిన కొట్నాన్న గంగన్నకు అప్పగించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మోతీరాంకు వినతిపత్రం అందజేశారు. తమ భూమి సమస్య పరిష్కరించాలని నిర్మల్ కలెక్టరేట్ వద్ద 46 రోజులు ధర్నా చేసినా పట్టించుకోలేదని గంగన్న వాపోయాడు. సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించామని.. సమస్య పరిష్కరించాలని వేడుకున్నారు. సంఘం జి ల్లా ప్ర ధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్, ముత్తన్న, ము రళి మోహన్, నవీన్, మోతీరాం కిషన్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

'అవినీతి రహిత సమాజమే లక్ష్యం'

నర్సాపూర్(జి): అవినీతి రహిత సమాజమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు ఎన్‌హెచ్‌ఆర్సీ స్టేట్ ఈసీ సభ్యులు, సామాజిక కార్యకర్త సయ్యద్ అలీం అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, అక్రమాలను నిరోధించేందుకు జాతీయ మానవ హక్కుల కమిటీ పనిచేస్తుందని తెలిపారు. పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడమే లక్ష్యమన్నారు. నర్సాపూర్(జి) తహసీల్దార్ , వ్యవసాయ, ఎంపీడీవో కార్యాలయాల్లో అవినీతి రహిత సమాజం కోసం సహకారం అందించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం గోడ ప్రతులను అంటించారు. జమీల్‌షా, సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

యూరియా తగ్గించి భూసారం కాపాడాలి

- గ్రామాల్లో అవగాహన కల్పించిన ఏఈవోలు

నర్సాపూర్(జి): రైతులు యూరియా వినియోగాన్ని తగ్గించి భూసారాన్ని కాపాడాలని గొల్లమాడ, చాక్‌పల్లి, నర్సాపూర్(జి) క్లస్టర్ల ఏఈఓలు గణేశ్, రమ్య, భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని ఆయా క్లస్టర్ల రైతువేదికల్లో శుక్రవారం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అధిక యూరియా వినియోగంతో కలిగే దుష్పరిణామాలను వివరించారు.

లక్ష్మణచాంద: అధిక యూరియా వినియోగంతో భూమి సారం కోల్పోయి పంట దిగుబడులు తగ్గుతాయని మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని వడ్యాల్ రైతువేదికలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. యూరియా స్థానంలో జీవన ఎరువులను వినియోగించాలని పేర్కొన్నారు. కనకాపూర్ క్లస్టర్ ఏఈవో సంతోష్, లక్ష్మణచాంద ఏఈవో ఉమ, పీచర ఏఈవో పవిత్ర పాల్గొన్నారు.



లక్ష్మణచాంద: మాట్లాడుతున్న ఏవో ప్రవీణ్‌కుమార్

సోన్: మండలంలోని మాదాపూర్ రైతువేదికలో అధిక యూరియా వినియోగంతో కలిగే నష్టాలను మండల వ్యవసాయాధికారి వినోద్ వివరించారు. యూరియా స్థానంలో ట్రైకో డెర్మా, సుడోమోనాస్, రైజోబియం వంటి జీవన ఎరువులు వినియోగించాలని పేర్కొన్నారు. దీంతో మొక్కకు నత్రజని, భాస్వరం అంది మంచి దిగుబడులు వస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓ అశోక్‌కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



సోన్: మాదాపూర్‌లో మాట్లాడుతున్న అధికారి

కడెం: రైతులు అధిక ఎరువుల నియోగాన్ని తగ్గించాలని ఏఈవో సురేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కల్లెడ గ్రామంలో సాగు చేసిన మొక్కజొన్న చేన్లను పరిశీలించారు. కత్తెరపురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజయెట్ మందు.. వరిలో మొగిపురుగు నివారణకు ఫిప్రోనిల్ గుళికలు వినియోగించాలని రైతులకు సూచించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో నానో యూరియాతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.

పంటల పరిశీలనలో విద్యార్థులు

భైంసారూరల్: మండలంలోని చింతల్‌బోరి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా గ్రామంలోని పొలాలను సందర్శించారు. రైతు సాగు చేస్తున్న పంటల వివరాలు, సస్యరక్షణ చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు నంగి కృష్ణ, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



వరిపొలంలో విద్యార్థులు